# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

మంగళవారం | 13 | అక్టోబర్ | 2026 | పేజీలు:11


## దుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ భరత్

10 లో



# ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్లపై భక్తుల హర్షం



9 లో

సమస్యలను సరిదిద్దుకుంటూ మరింత మెరుగైన సౌకర్యాలు
భక్తుల సౌకర్యమే లక్ష్యంగా కలెక్టర్, దేవస్థానం, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయం

-విజయవాడ, మనంబ్యూరోచీఫ్

2 లో



## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

## భక్తులకు సౌకర్యవంతమైన దర్శనమే లక్ష్యం

8 లో



సామాన్య భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు
భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు - భద్రతకు పెద్దపీట
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు
రాష్ట్ర దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



**జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ**

**గుంటూరు , అక్టోబర్ 12 (మనంప్రతినిధి):** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ,డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పిడి శంకర్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యంకాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ**



**గుంటూరు, అక్టోబర్ 12 (మనం న్యూస్ ప్రతినిధి):**జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో కలసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, తహసీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమన్వయ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలు, వార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించి మంగళవారం నాటికి పంపాలన్నారు. ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సాధారణ, సున్నిత, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాల జాబితాను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, వాటిని మరోసారి పరిశీలించాలని సూచించారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ఎన్నికల విధుల నిర్వహణకు ముందుగానే సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వస్తుందన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు సంబంధించి సమావేశాలు, ర్యాలీలు,లౌడ్స్పీకర్ల వినియోగం తదితర అనుమతుల జారీకి సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలన్నారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్. మాట్లాడుతూ, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించే ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గత అనుభవాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తించాలన్నారు.బైండ్ ఓవర్ కేసులుపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించడం ద్వారా శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డిపిఓ సాయికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విక్టరీ బజార్‌ను ప్రారంభించిన తిరువూరు ఆర్డీవో ఏ. కుమార్



**తిరువూరు, అక్టోబర్ 12, మనం న్యూస్:** తిరువూరు పట్టణ ప్రజలకు నిత్యావసర సరుకుల కొనుగోలులో మరింత సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నూతన మార్ట్ విక్టరీ బజార్ను తిరువూరు రెవెన్యూ డివిజన్ అధికారి ఏ. కుమార్ నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఏ. కుమార్ మాట్లాడుతూ, పట్టణంలో పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన వ్యాపార సంస్థలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యావసర సరుకుల కొనుగోలుకు మరింత సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి రావడం వల్ల వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విక్టరీ బజార్ నిర్వాహకులు వెంకటరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, విష్ణురెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో ఏ. కుమార్ ని ఘనంగా సన్మానించారు. తిరువూరు పట్టణ ప్రజలకు నిత్యావసర సరుకులను ఒకే చోట అందుబాటులో ఉంచుతూ, కొనుగోలుదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ మార్ట్ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నూతన మార్ట్ అందుబాటులోకి రావడంతో తిరువూరు పట్టణ ప్రజలకు నిత్యావసర సరుకుల కొనుగోలులో మరింత సౌలభ్యం కలగనుంది.

# బిగ్ బిలియన్ డేస్‌కు భారీ స్పందన

**గాంధీనగర్, అక్టోబర్ 12 మనం న్యూస్:** పండగల సీజన్లో ఆన్లైన్ షాపింగ్కు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని ఫ్లిప్కార్ట్ బిగ్ బిలియన్ డేస్ 2026 ప్రారంభ గణాంకాలు వెల్లడించాయి. ఈ విక్రయ కార్యక్రమం 13వ ఎడిషన్ ప్రారంభమైన తొలి గంటలోనే ఒక నిమిషంలో 63 లక్షల మంది ఏకకాల వినియోగదారులు ఫ్లిప్కార్ట్ను సందర్శించారు. సాధారణ సమయంతో పోలిస్తే తొలి గంటలో ఆరు రెట్లకు పైగా షాపింగ్ జరగగా, కొత్త వినియోగదారుల సంఖ్య 34 శాతం పెరిగింది. మొత్తం 2.87 కోట్లకు పైగా సెషన్లు నమోదయ్యాయి. వీటిలో సుమారు 60 శాతం డిమాండ్ మెట్రోయేతర నగరాల నుంచి వచ్చింది. మొబైల్ ఫోన్ల కొనుగోళ్లలో ఎక్స్ఛేంజ్, నో కాస్ట్ ఈఎంఐ పద్ధతులకు వినియోగదారులు ప్రాధాన్యమిచ్చారు. ఫ్లిప్కార్ట్ మినిట్స్ ఆర్డర్లు 3.5 రెట్లు పెరగ్గా, కొత్త వినియోగదారుల సంఖ్య 11 రెట్లు వృద్ధి చెందింది. న్యూఢిల్లీలో ఓ వినియోగదారుడికి ఐఫోన్ 17 కేవలం 3.4 నిమిషాల్లోనే డెలివరీ అయింది. టైర్-2, అంతకంటే చిన్న నగరాల్లోనూ కొనుగోళ్లు, వాయిస్ సెర్చ్కు ఆదరణ పెరగడం విశేషం.

# జగన్మాత నామస్మరణతో మారుమోగుతున్న ఆలయాలు



**నందిగామ,అక్టోబర్ 12,మనం న్యూస్:** నందిగామ మండలంలో పలు శైవక్షేత్రాలు దేవీ ఆలయాలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు సోమవారం నందిగామ మండలం అంబరుపేట గ్రామంలోని స్వయంభోగా వెలసిన శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆల ఈవో పీవీకే సీతారామమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు, ధర్మకర్తల మండల సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాముల నందిగామ సుబ్బారావు శర్మ బాలకోటేశ్వర శర్మ, రఘునాథ శర్మ అవధానిల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ విశేష కుంకుమార్చనలు, చండీ సహిత రుద్ర హోమాధి క్రతువులు వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు బారులు తీరి పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, గొల్లమూడి శంభు లింగేశ్వర స్వామి ఆలయం, వీరభద్ర స్వామి ఆలయం, కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, పల్లగిరి గట్టుపై కనకదుర్గ కనకమహాలక్ష్మి జ్ఞాన సరస్వతి అమ్మవార్ల త్రిశక్తి పీఠంలో జగన్మాత గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది, ఆలయాల్లో ఆలయాల్లో అమ్మవార్లకు ఖడ్గమాల విశేష కుంకుమార్చనలు శ్రీ చక్ర నవవర్ణార్చనలు, సామూహిక కుంకుమార్చన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. సంక్షేమానికి వెనకడుగు లేదు!

**ప్రజల యోగక్షేమాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన..**

**నందిగామలో 162 మంది లబ్ధిదారులకు రూ.83.86 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ**



**నందిగామ,అక్టోబర్ 12,మనం న్యూస్:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, లోటు బడ్జెట్ వంటి సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించకుండా అర్హులైన పేదలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక భారం, వారి యోగక్షేమాలకు ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. నందిగామ పట్టణంలోని శ్రీకరం రుద్రాక్ష మినీ ఫంక్షన్ హాల్లో కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గానికి చెందిన 162 మంది లబ్ధిదారులకు రూ.83,86,038 విలువైన చెక్కులను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నేరుగా అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, అవసరమైన సమయంలో వారికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తంగిరాల సౌమ్య తెలిపారు. ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ వైద్య ఖర్చులను భరించలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక పరిమితులు, గత పాలన నుంచి ఎదురైన ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు అందాల్సిన సంక్షేమ సాయాన్ని వీలైనంత సమర్థవంతంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను కూడా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, కష్టకాలంలో అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ ద్వారా బాధిత కుటుంబాలకు ప్రత్యక్షంగా సహాయం అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నందిగామ అభివృద్ధిలో మరో మైలురాయి

- కేంద్రీయ విశ్వవిద్యాలయ శాశ్వత భవన నిర్మాణ పనులపై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక దృష్టి
- రాఘవపురంలో నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్..
- నాణ్యతతో పాటు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచన..



**నందిగామ,అక్టోబర్ 12,మనం న్యూస్:** నందిగామ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యావకాశాలు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నాడు నందిగామ మండలం రాఘవపురం గ్రామంలో శాశ్వత కేంద్రీయ విశ్వవిద్యాలయ భవనం నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పరిస్థితి ఏమిటి అనే అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత

కేంద్రీయ విశ్వవిద్యాలయ శాశ్వత భవనం అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు, ఉన్నత విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు దోహదపడనుంది. ఈ నిర్మాణం పూర్తయితే నందిగామ ప్రాంతానికి విద్యాపరంగా మరింత గుర్తింపు లభించే అవకాశముంది. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇటువంటి కీలక ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సమన్వయంతో పనులు ముందుకు సాగేలా చూడటమే తన లక్ష్యమని ఎమ్మెల్యే సౌమ్య క్షేత్రస్థాయి పర్యటన స్పష్టం చేస్తోంది.

### అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ

ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో సకాలంలో కార్యరూపం దాల్చేలా ఎమ్మెల్యే సౌమ్య అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. రాఘవపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయ శాశ్వత భవన నిర్మాణ పనుల పరిశీలన కూడా నియోజకవర్గ అభివృద్ధి, విద్యారంగ ప్రగతిపై ఆమె చూపుతున్న శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

- గోపూజతో ప్రారంభమైన విశేష పూజలు



**నందిగామ, అక్టోబర్ 12, మనం న్యూస్:** నందిగామ పట్టణంలోని నెహ్రూ నగర్ లో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆలయంలో గోపూజతో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గోపూజ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ప్రత్యేక మండపంలో ఏర్పాటు చేసిన శ్రీ చక్రం వద్ద అమ్మవారికి సహిత పూజలు నిర్వహించారు.



అమ్మవారు రెండవ రోజు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే సకల వేద మంత్రాల పుణ్యఫలం, జ్ఞానసిద్ధి కలుగుతుందని అర్చకులు తెలిపారు. ఉదయం నుండి లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, చండీ హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు పిలుపుమేరకు కార్మికుల ధర్నా



- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె గోపాల్

**నందిగామ,అక్టోబర్12,మనంన్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు పిలుపుమేరకు నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకి 12వ పిఆర్సి ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పని చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. అన్ని విభాగాల్లో పనిచేసే కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి. పర్మినెంట్ చేయాలి. నందిగామ మున్సిపల్ ఆఫీస్ లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి. ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దసవరపు సైదా,సలికేటి నరేష్, మాణిక్యం, బేబీ,భూసి, సంతీష్, చిన్న అమ్మాయి, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

# జపాన్‌లో దశాబ్దంలో సగానికి తగ్గిన ధూమపానం

**గాంధీనగర్ అక్టోబర్ 12 మనం న్యూస్:** శాస్త్రీయ ఆధారాలతో రూపొందించిన పొగ రహిత ప్రత్యామ్నాయాలు, సమర్థవంతమైన నియంత్రణ విధానాలు ధూమపానాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషించగలవని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 30న తాష్కెంట్లో నిర్వహించిన టెక్నోవేషన్ తాష్కెంట్ 2026 అంతర్జాతీయ సదస్సులో జపాన్, స్వీడన్, అమెరికా దేశాల అనుభవాలను చర్చించారు. జపాన్లో 2014లో సుమారు 20 శాతంగా ఉన్న ధూమపాన రేటు దశాబ్దంలో దాదాపు 10 శాతానికి తగ్గిందని, 2011-2023 మధ్య సిగరెట్ల అమ్మకాలు సగానికి పైగా పడిపోయాయని నిపుణులు పేర్కొన్నారు. వేడి చేసిన పొగాకు ఉత్పత్తుల వినియోగం పెరగడం ఇందుకు ఒక కారణంగా అధ్యయనాలు గుర్తించాయని తెలిపారు. స్వీడన్లో సిగరెట్లకు బదులుగా స్నస్, నికోటిన్ పౌచ్ల వినియోగం పెరగడంతో 2025 నాటికి రోజువారీ ధూమపానం 3.7 శాతానికి తగ్గిందని వివరించారు. అయితే, ఏ పొగాకు ఉత్పత్తి కూడా పూర్తిగా సురక్షితం కాదని, ధూమపానం మానేయడమే ఉత్తమమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. పొగాకు నియంత్రణ విధానాలు నిషేధాలకే పరిమితం కాకుండా, స్వతంత్ర శాస్త్రీయ పరిశోధనలు, ప్రజారోగ్య ఆధారాలపై రూపొందాలని సూచించారు. భారతదేశంలో 2016-17 సర్వే ప్రకారం




సుమారు 26.7 కోట్ల మంది పొగాకు వినియోగదారులు ఉన్నారని, ఇందులో 9.95 కోట్ల మంది ధూమపానం చేసేవారని వెల్లడించారు. ఇతర దేశాల అనుభవాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని వక్తలు ప్రభుత్వాలకు సూచించారు.

# జిఎంసి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను వేగవంతం చేయాలి



- కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు అక్టోబర్ :12( మనం న్యూస్ ప్రతినిధి)** నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికల నిర్వహణను అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా చేపట్టేందుకు అవసరమైన ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ స్థానిక ఏసి కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలించి, ఎన్నికల సామాగ్రి పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవడంపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థలో 76 వార్డ్ లకు సంబంధించి 596 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే 27 మంది రిటర్నింగ్ అధికారులను నియామకం చేశామన్నారు. రిటర్నింగ్ అధికారుల వారీగా ఎన్నికల సామాగ్రి సక్రమంగా ఇబ్బందులు లేకుండా అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి సామాగ్రి తరలించడానికి వచ్చే బస్ లకు సరైన మార్గం ఉండేలా,సిబ్బందికి భోజనం సదుపాయం పక్కాగా చేపట్టాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్లు ఐ.కిషోర్, జి.రవీంధ్ర (ఎస్టబ్ల్యూ), డిప్యూటి కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, సిటి ప్లానర్ డి.రాంబాబు, ఏసిపి జకిరా, డిఈఈ హనీఫ్, ఎస్ ఎస్ సాంబయ్య,సర్వేయర్లు లక్ష్మీనారయణ,సుభాని పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల సమస్యపై తక్షణ స్పందన

- విశ్వబ్రాహ్మణుల స్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు, త్వరలో గ్రావెల్ ఏర్పాటు..
- డంపింగ్ తొలగించి స్మశాన వాటికను చదును చేయించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబర్ 12,మనం న్యూస్:** విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యని కలిసి తమ స్మశాన వాటికలో పేరుకుపోయిన డంపింగ్ వ్యర్థాలను తొలగించి, స్థలాన్ని చదును చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై స్పందించి డంపింగ్ను తొలగించి స్మశాన వాటికను చదును చేయించడం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం నాడు విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు, కూటమి నాయకులతో కలిసి తంగిరాల సౌమ్య స్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా స్మశాన వాటికకు త్వరలో గ్రావెల్ కూడా అందజేసి, అవసరమైన అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు తమ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.

## జుజ్జూరులో అఖిలాండేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన

**వీరులపాడు అక్టోబర్ 12, మనం న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలోని శ్రీ సర్వజ్ఞపీఠం అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి యోగి నరేంద్రానంద స్వామీజీ మాట్లాడుతూ.. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కుంకుమార్చన కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా భక్తుల కోసం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో



పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందని మహిళా భక్తులు తెలిపారు.

# కత్తితో బెదిరించి సాఫ్ట్వేర్ ఉద్యోగి నుంచి రూ.65 వేల దోపిడీ

**▸▸ నలుగురు నిందితుల అరెస్ట్..**
**రూ.50 వేల నగదు, కత్తులు,**
**ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**తాడేపల్లి, అక్టోబర్ 12, మనం న్యూస్:** తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సాఫ్ట్వేర్ ఉద్యోగిని కత్తి, చాకుతో బెదిరించి ఫోన్పే ద్వారా రూ.65 వేలు దోచుకున్న కేసులో నలుగురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు మైనర్ కాగా, మరో ముగ్గురిని మీడియా ముందు ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా నార్త్ డి ఎస్పి కె.వెంకటేశ్వర్లులు మీడియాతో మాట్లాడుతూ నిందితుల నుంచి రూ.50 వేల నగదుతో పాటు నేరానికి ఉపయోగించిన కత్తులు, చాకు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. ఈ నెల 6,10 తేదీల్లో జరిగిన ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. విశ్రాంతి సమయంలో బయటకు వచ్చిన సాఫ్ట్వేర్ ఉద్యోగిని ఐదుగురు వ్యక్తులు అడ్డగించి, కత్తితో బెదిరించి ఫోన్పే ద్వారా డబ్బులు బదిలీ చేయించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో



భాగంగా ఎస్ఐ కాజావల్లి, క్రైమ్ టీమ్ సిబ్బంది ప్రసాద్, జోసెఫ్ తదితరులు సాంకేతిక ఆధారాలు, ఫోన్పే లావాదేవీలను పరిశీలించి అక్బర్ బాషా,ఇంద్రనీల్, తుమ్మల మహేష్, యశ్వంత్, శివసాయిలను నిందితులుగా గుర్తించారు. వీరిలో నలుగురిని అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడిగా పేర్కొన్న అక్బర్ బాషాపై గతంలో సుమారు 14 కేసులు ఉండగా, వాటిలో రెండు గంజాయి కేసులు ఉన్నాయి. ఇంద్రనీ్ల మూడు కేసులు ఉండగా, వాటిలో గంజాయి కేసులు కూడా ఉన్నట్లు తెలిపారు.నిందితులు తరచూ నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో వారిపై సంబంధిత చర్యలు తీసుకుంటామని, అవసరమైన వారికి హిస్టరీ షీట్లు తెరుస్తామని పోలీసులు వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఘటనలు లేదా నేరాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాడేపల్లి సీఐ వీరేంద్ర బాబు, ఎస్ ఐ లు ఖాజా వలి, ప్రదీప్ లు సిబ్బంది పాల్గొన్నారు.

## నందిగామ పాలిటిక్స్‌లో భారీ మార్పు




**▸▸ మున్సిపల్ ఛైర్మన్ పీఠం ‘జనరల్’ కేటాయింపు!**
**▸▸ హోరాహోరీ సమరానికి తెరలేచిన వేళ..**
**▸▸ రంగంలోకి దిగేందుకు ఆశావహుల ఉత్సాహం!**

నందిగామ,అక్టోబర్ 12, మనం న్యూస్: రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగే సమయం దగ్గరపడుతుండటంతో నందిగామ రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్పర్సన్ స్థానాల రిజర్వేషన్లను రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ అధికారికంగా ఖరారు చేస్తూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ తాజా నోటిఫికేషన్లో నందిగామ మున్సిపాలిటీ ఛైర్పర్సన్ స్థానం ‘అన్రిజర్వ్డ్’ (జనరల్) కేటగిరీ కింద ఖరారైంది. ఛైర్మన్ పీఠం జనరల్కు దక్కడంతో ప్రధాన పార్టీలైన అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. ఎవరికి వారు ముందస్తు వ్యూహాలు రచిస్తూ, అధిష్ఠానం వద్ద తమ పరపతిని నిరూపించుకునేందుకు కీలక నేతలు పావులు కదుపుతున్నారు. రాబోయే ఎన్నికల్లో నందిగామ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు రసవత్తర పోరు ఖాయంగా కనిపిస్తోంది.

## బీసీ రిజర్వేషన్లపై జగన్ ప్రభుత్వాన్ని విమర్శించిన పూర్ణచంద్రరావు

**▸▸ స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన ఐక్యపోరుకు ఎస్డీఎఫ్ పిలుపు**

**గాంధీనగర్, అక్టోబర్ 12(మనం న్యూస్):** బీసీ రిజర్వేషన్ల విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి బీసీలకు తీరని అన్యాయం చేశారని విశ్రాంత డీజీపీ, సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఉమ్మడి అభ్యర్థులను బరిలోకి దింపుతామని ప్రకటించారు.గాంధీనగర్లోని శ్రీరామ ఫంక్షన్ హాల్లో వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక సంస్థల్లో సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం అనే అంశంపై రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్గా విశ్రాంత డీజీపీ, ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త డాక్టర్ జె. పూర్ణచంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ అధికారం కొద్దిమంది సామాజిక వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమైందని విమర్శించారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల హామీ అమలుపై ప్రధాన రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. రిజర్వుడు స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లోనూ జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా, ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యం, ఆదివాసీల భూమి, అటవీ



హక్కులు, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల పునరావాసం వంటి అంశాలపై పోరాటం చేస్తామని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య గౌడ్ రెండు ప్రధాన పార్టీల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలకాలని పిలుపునివ్వగా, ప్రొఫెసర్ పాల్ తమిళనాడు తరహా రాజకీయ మార్పుపై తన అభిప్రాయాలను వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే లక్కే రాజారావు బహుజన శక్తుల ఐక్యపోరాటం అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విశ్రాంత అధికారులు, బహుజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు ఎస్డీఎఫ్లో చేరారు.

## టీడీపీతోనే బీసీలకు పెద్దపీట

**▸▸ చంద్రబాబు హయాంలోనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు**
**▸▸ దానబోయిన, వల్లభనేని**



**తాడేపల్లి, అక్టోబర్ 12, మనం న్యూస్:** బీసీలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు కల్పించి, వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్,టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు.సోమవారం తాడేపల్లి టీడీపీ పట్టణ కార్యాల యంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1987లో బీసీ సెల్ను ఏర్పాటు చేసిన టీడీపీ, బీసీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 1996లో పంచాయతీరాజ్ వ్యవస్థలో బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించారని వివరించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని దాని వల్ల 16,800 మంది బీసీ లు నష్ట పోయారని అన్నారు.బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుం దని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసే విషయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని తెలిపారుబీసీల సంక్షేమం, అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అద్దంకి మురళి, కేళి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడమే టీడీపీ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి దారా దాసు,ఇట్టా భాస్కర్, మున్నంగి సంజీవరెడ్డి, మండవ గోపాల రావు, జి.నాగేశ్వరరావు తాడి పోయిన భాస్కర్, పుల్లెపు భాస్కర రావు, లావణ్య, తాడిబోయిన గోపి,కంభం సాయి చంద్, అడపా నరేష్, సుబ్బారావు, వెంకటరెడ్డి, బచ్చియా,చింకా శ్రీను,బబ్లు, అంజిరెడ్డి, రంగస్వామి, బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ దళాల పతాక దినోత్సవంకు మహిళా సంఘాలు రూ.6.92 లక్షల విరాళం



**గుంటూరు అక్టోబర్12 (మనం న్యూస్ ప్రతినిధి) :** సాయుధ దళాల పతాక దినోత్సవంకు మహిళా సంఘాలు రూ.6.92 లక్షల విరాళంగా అందించి ఆదర్శంగా నిలిచాయి. ఈ మొత్తం చెక్కును సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ కు డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికులు, యుద్ధంలో గాయపడిన సైనికులు, అమర జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం మహిళా సంఘాల సభ్యులు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ప్రజలు పతాక చిహ్నాలను స్వీకరించి విరాళాలు అందించి సైనికుల సంక్షేమ కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందజేయాలని కోరారు.దేశ రక్షణలో సైనికులు చేస్తున్న త్యాగాలను స్మరించుకోవడం, వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎక్కువ మొత్తం విరాళంగా సేకరించిన ఏ పి ఎం లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి ఆర్ గుణశీల, డి.ఆర్.డి.ఏ ఏ.పీ.ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# జిఎంసి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను వేగవంతం చేయాలి



**▸▸ కమిషనర్ మయూర్ అశోక్**

**గుంటూరు అక్టోబర్ 12( మనం న్యూస్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికల నిర్వహణను అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా చేపట్టేందుకు అవసరమైన ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ స్థానిక ఏసి కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలించి, ఎన్నికల సామాగ్రి పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవడంపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థలో 76 వార్డ్ లకు సంబంధించి 596 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే 27 మంది రిటర్నింగ్ అధికారులను నియామకం చేశామన్నారు .రిటర్నింగ్ అధికారుల వారీగా ఎన్నికల సామాగ్రి సక్రమంగా ఇబ్బందులు లేకుండా అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి సామాగ్రి తరలించడానికి వచ్చే బస్ లకు సరైన మార్గం ఉండేలా,సిబ్బందికి భోజనం సదుపాయం పక్కాగా చేపట్టాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్లు ఐ.కిషోర్, జి.రవీంధ్ర (ఎస్డబ్ల్యూ), డిప్యూటి కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, సిటి ప్లానర్ డి.రాంబాబు, ఏసిపీ జకిరా, డిఈఈ హనీఫ్, ఎస్ ఎస్ సాంబయ్య,సర్వేయర్లు లక్ష్మీనారయణ, సుభాని పాల్గొన్నారు.

## స్థానిక సంస్థ ఎన్నికల నిర్వహణకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ రానున్నదని, సదరు ఎన్నికల నిర్వహణకు అన్ని శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.నగర కమిషనర్



**గుంటూరు అక్టోబర్ :12 (మనం న్యూస్ ప్రతినిధి )**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గుంటూరు నగరంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో తనిఖీ చేయించి సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా విభజించి, సదరు ప్రాంతాలలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ మరియు అడిషనల్ ఎలక్షన్ అధారిటీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థలోని కమిషనర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నగరంలోని డియస్పిలు, తహసిల్దార్లు, నగర పాలక సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ రానున్నదని, సదరు ఎన్నికల నిర్వహణకు అన్ని శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.నగర పాలక సంస్థ పరిధిలో పోలింగ్ నిర్వహించుటకు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయుట జరిగిందని, సదరు పోలింగ్ స్టేషన్ల పరిధిలో జోనల్ అధికారులు, యస్.హెచ్.ఓలు మరియు టిపిబిఓలతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి, పోలింగ్ స్టేషన్ల పరిధిలో పర్యటించి, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి, సదరు ప్రాంతాలలో అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ జరుగు ప్రాంతాలలో మరియు స్ట్రాంగ్ రూమ్ ల వద్ద అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థులకు ఎన్నికల ప్రచారానికి, ర్యాలీలకు మరియు సమావేశాలకు అవసరమైన అనుమతులు ఇవ్వటానికి సింగల్ విండో విధానాన్ని ఏర్పాటు చేసి, అభ్యర్ధులకు అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా నగరంలో ఆర్.ఓ ఆఫీస్ లను ఏర్పాటు చేస్తున్నామని,ఎన్నికలలో పాల్గొనే అభ్యర్ధులు నామినేషన్లను వేయడానికి ఆర్.ఓ ఆఫీస్ లకు వస్తారని, కావున ఆర్.ఓ ఆఫీస్ ల వద్ద ఎన్నికల నిబంధనల ప్రకారం అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తరువాత (యంసిసి) మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ ను పక్కాగా అమలు చేయడానికి బృందాలను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశం నందు అదనపు కమిషనర్లు ఐ. కిషోర్,జి. రవీంద్ర, డి.యస్.పిలు సీతారాం,శ్రీనివాసరావు, పూర్ణచంద్ర రావు, డి.సిలు బి. శ్రీనివాసరావు,సాంబశివరావు, సి.హెచ్ శ్రీనివాస్, డి.సి.పి సూరజ్ కుమార్, తహసిల్దార్లు కిరణ్, సుబాని, డిప్యూటీ తహసిల్దార్ నాగమల్లెస్వర రావు పాల్గొన్నారు.

# దుర్గమ్మకు సంగీత స్వరాభిషేకం



**▸▸ గుప్తాకి దసరా పురస్కారం అందచేస్తున్న నిర్వాహకులు**

**గాంధీనగర్, అక్టోబర్ 12(మనం న్యూస్):** దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి సంగీత గీతాలాపనతో స్వరాభిషేకం నిర్వహించారు. కళాకారులందరిపై దుర్గమ్మ కరుణాకటాక్షాలు ప్రసరించాలని, ప్రతి కళాకారుడి ఇంట సంతోష సంబరాలు వెల్లివిరియాలని ప్రముఖ కళాకారుడు, రాష్ట్ర నటీనట నాట్య వత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా ఆకాంక్షించారు.రాష్ట్రం, దేశం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, కళా సాంస్కృతిక వైభవం మరింత వర్ధిల్లాలని ఆయన శ్లోకార్థ సహితంగా గీతాలాపన చేస్తూ అమ్మవారిని ప్రార్థించారు.జేఎన్ఎస్ సరాగాల సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో, ఝాన్సీ లక్ష్మి నేతత్వంలో విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో 'దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యా..' పేరుతో పాటల కచేరీ నిర్వహించారు. సంగీత విభావరిలో కళాకారులు తమ గీతాలతో ప్రేక్షకులను అలరించారు.ఈ సందర్భంగా వేముల హజరత్తయ్య గుప్తా, కాకుమాను శ్రీనివాసరావులకు నిర్వాహకులు ఘనంగా దసరా సత్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ధన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టెవా '2 మిలియన్ ఉమెన్' కార్యక్రమానికి రెండేళ్లు

**గాంధీనగర్ అక్టోబర్ 12 మనం న్యూస్:** భారత వ్యవసాయ రంగంలో మహిళా సాధికారతే లక్ష్యంగా కోర్టెవా అగ్రిసైన్స్ ప్రారంభించిన '2 మిలియన్ ఉమెన్' కార్యక్రమం రెండేళ్లు పూర్తి చేసుకుంది. 2024 సెప్టెంబర్లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా 2030 నాటికి వ్యవసాయ రంగంలో మహిళలకు సాధికారత కల్పించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 22 రాష్ట్రాల్లో 7.95 లక్షల మందికి పైగా చేరుకోగా, వారిలో 6.37 లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారు. సుమారు 49 వేల మంది మహిళలు నాయకులుగా, సామాజిక మార్పు ప్రతినిధులుగా ఎదిగారు. 90 వేల మందికి పైగా రైతులకు శిక్షణ అందించగా, 1.54 లక్షలకు పైగా జీవనోపాధులను బలోపేతం చేశారు. 1.71 లక్షల హెక్టార్లకు పైగా భూమిలో మెరుగైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించారు. మధ్యప్రదేశ్లోని ఉమరియా జిల్లాలో మహిళలు మహువా పువ్వులతో పోషక విలువలున్న లడ్డూలను తయారు చేస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడం ఈ కార్యక్రమ ప్రభావానికి నిదర్శనంగా నిలిచింది. మహిళలకు నైపుణ్యాలు, జ్ఞానం, మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడంతోపాటు గ్రామీణ కుటుంబాలు, రైతు సంఘాలు, సమాజాలను బలోపేతం చేస్తున్నామని కోర్టెవా ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులోనూ మహిళల నాయకత్వాన్ని, వ్యవసాయ రంగంలో వారి భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షిక విచారణ.. నిర్ణీత గడువులోగా పరిష్కారం

**▸▸ బాధితులకు న్యాయం చేయడమే ముఖ్య లక్ష్యం**

**గుంటూరు అక్టోబర్ 12 (మనం న్యూస్ ప్రతినిధి):** పి జి ఆర్ ఎస్ లో 147 ఫిర్యాదుల స్వీకరణ - పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారు లకు సమాచారం అందించాలి: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్.గుంటూరు జిల్లా లో ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ( పి జి ఆర్ ఎస్) ద్వారా అందే ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, నిష్పాక్షికంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు.ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన. పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు,అదనపు ఎస్పీ,డీఎస్పీ స్థాయి అధికారులు,ఇతర పోలీస్ అధికారులు అందరు 147 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదు ను ఎస్పీ పరిశీలించి,సంబంధిత అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై నిష్పాక్షికంగా విచారణ జరిపి,వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలి. పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్లైన్ విధానంలో సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం. ప్రతి పిటిష్న పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారునికి తప్పనిసరిగా



తెలియజేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుని అభిప్రాయాన్ని తెలుసుకున్న అనంతరం మాత్రమే పిటిషన్ను ముగించాలని అధికారులకు సూచించారు. తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి.ప్రజల సమస్యలకు కేవలం తాత్కాలిక పరిష్కారాలతో సరిపెట్టకుండా, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో, సేవాభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజలకు సులభతరమైన ఫిర్యాదు నమోదు ప్రక్రియ.పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో జిల్లా పోలీస్ సిబ్బంది సహకారం అందించారు.ప్రజలు తమ సమస్యలను ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా అవసరమైన సహాయాన్ని అందించారు. అన్నదాన కార్యక్రమాన్ని అభినందించిన ఎస్పీ.ఈ సందర్భంగా గుంటూరులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్,సాయినగర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ అడ్మిన్ రమణమూర్తి, సౌత్ డిఎస్పి పూర్ణచంద్రరావు , వెస్ట్ డీస్పీ బెల్లం శ్రీనివాసరావు పి జి ఆర్ ఎస్ సీఐ బిలాలుద్దీన్ పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాపారావు మృతి పాల ఉత్పత్తిదారులకు తీరని లోటు



**కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ దాసరి వెంకట బాలవర్ధనరావు**

**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 12 ( మనం న్యూస్ ):** బాపులపాడు మండలం, వేలేరు ఎం.పి.ఎం.ఎ.సి. ఎస్.,మాజీ అధ్యక్షులు, కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా మాజీ డైరెక్టర్ దోనవల్లి బాపారావు మృతి జిల్లాలోని పాల ఉత్పత్తిదారులకు తీరనిలోటని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ డాక్టర్ దాసరి వెంకట బాల వర్ధనరావు అన్నారు. బాపులపాడు మండలం, వేలేరులోని దోనవల్లి బాపారావు పెద్దకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి డ్హా దాసరి వెంకట బాలవర్ధనరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన కుమారుడు దోనవల్లి నాగమునీంద్రకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా దాసరి వెంకట బాలవర్ధనరావు మాట్లాడుతూ దోనవల్లి బాపారావు సుదీర్ఘకాలం వేలేరు ఎం.పి.ఎం. ఎ.సి.ఎస్., అధ్యక్షులుగా పనిచేసి, కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టర్ గా ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేసి వేలేరు సొసైటీకి పలు అవార్డులు తీసుకువచ్చారని, హనుమాన్ జంక్షన్ పాలశీతల కేంద్రం పరిధిలో పాల సొసైటీల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని,వేలేరు గ్రామ టి.డి.పి.కమిటీ అధ్యక్షులుగా కూడా పనిచేసి వేలేరు గ్రామాభివృద్ధికి, తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు,రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, హనుమాన్ షుగర్స్ మాజీ ఛైర్మన్ గుండపనేని ఉమా వరప్రసాద్,బాపులపాడు మాజీ జడ్.పి.టి.సి. వేగిరెడ్డి పాపారావు,,వేలేరు ఎమ్ పి ఎమ్ ఏ సి ఎస్ అధ్యక్షులు దోనవల్లి రామారావు,వేలేరు పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు అవిర్నేని భవానీశంకర్, మండల తెలుగు దేశం పార్టీ నాయకులు చలసాని శ్రీనివాసరావు, కొనకళ్ళ దుర్గారావు, మొవ్వ వేణుగోపాల్, దోనవల్లి శేషగిరిరావు నీటి సంఘం అధ్యక్షులు కడియాల శ్రీనివాసరావు, కృష్ణామిల్క్ యూనియన్ అధికారులు, పాల సొసైటీ అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో రూ.7.5 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాజగోపాల్ శంకుస్థాపన



**జగ్గయ్యపేట, అక్టోబర్ 12: మనం న్యూస్:** జగ్గయ్యపేట పట్టణంలోని వి ఎన్ కె టవర్స్ నుండి అలాసపురి వారి వీధి వరకు సుమారు 125 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం రూ.7.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గల్లా సంధ్యారాణి ,వైకుంఠేశ్వరరావు , మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ , తెదేపా నాయకులు పెద్దాపరపు వేణు , షేక్ ఉమర్ , మోహన్ , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజల రాకపోకల సమస్యలు తీరుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎస్సై మర్రి సుబ్బారావు మృతి పట్ల జిల్లా ఎస్పీ వకుల్ సంతాపం



**గుంటూరు, అక్టోబర్ 12: (మనం న్యూస్ ప్రతినిధి)** పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఎస్త్సగా విధులు నిర్వహిస్తున్న మర్రి సుబ్బారావు, గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతి పట్ల గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్త్స మర్రి సుబ్బారావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి జిల్లా ఎస్పీ నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మర్రి సుబ్బారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒకరు ఎంబీబీఎస్, మరొకరు బీటెక్ చదువుతున్నారు.ఆయన మృతి పోలీస్ శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది. సహచర పోలీసు అధికారులు, సిబ్బంది ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ,కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జనరల్ మహిళ కు జగ్గయ్యపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ కేటాయింపు

**జగ్గయ్యపేట అక్టోబర్ 12 మనం న్యూస్:** మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాన్ని జనరల్ మహిళ కు కేటాయించడంతో అన్ని పార్టీల నుంచి అభ్యర్థుల ఎంపికపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఇప్పటివరకు జగ్గయ్యపేట మున్సిపల్ చైర్ పర్సన్ స్థానం ఓసి అవుతుందని తెలుగుదేశం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జనసేన నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు ఊహాగానాలు చెక్కర్లు కొట్టాయి. అందరి ఊహ గానాలకు తెర దించుతూ మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించడంతో ఇక ఏ పార్టీ నుంచి ఏ మహిళ అభ్యర్థి పోటీలోకి వస్తారంటూ ఊహాగానాలు జోరందుకున్నాయి. అధికార కూటమి నుంచి జగ్గయ్యపేట స్థానం ఎవరికి కేటాయిస్తారు. ఏ పార్టీకి కేటాయిస్తే ఎవరు అభ్యర్థి అవుతారు అంటూ తెలుగుదేశం ,జనసేన ల నుంచి ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. తెలుగుదేశం కార్యకర్తల నుంచి మాత్రం జగ్గయ్యపేట మున్సిపాలిటీ స్థానం తెలుగుదేశం పార్టీకే కేటాయించడం జరుగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చైర్మన్ స్థానం కేటాయిస్తే ఆ పార్టీ నుంచి యువ నేత శ్రీరామ్ చిన్నబాబు సతీమణి శ్రీరామ్ శ్రీవల్లి పేరు బలంగా వినిపిస్తోంది. అలానే ఆచంట సునీత, తదితర పేర్లు కార్యకర్తల ఊహాగానాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. ఇక జనసేన కు జగ్గయ్యపేట సీటు కేటాయిస్తారని ఆస్థానం నుంచి ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమల భాను పోటీ చేస్తారంటూ జనసేన కార్యకర్తల నుంచి ఊహాగానాలు జోరందుకున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ సతీమణి ఇంటూరి శ్రీలత, ప్రముఖ దంత వైద్యురాలు బొజ్జ సౌమ్య, ప్రస్తుతం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హాఫీ జున్నేసా పేర్లు వినిపిస్తున్నాయి. కూటమి పార్టీలలో జగ్గయ్యపేట ను ఎవరికి కేటాయిస్తారు. అనేది తేలాల్సి ఉంది.



## జగ్గయ్యపేట చరిత్రలో నభూతో నాభవిష్యతి అనేలా అభివృద్ధి చేశాం



**205 కోట్ల అభివృద్ధి మా కౌన్సిల్ ఘనత.. 95% పనులు పూర్తి చేశాం**
**కౌన్సిల్ చివరి సమావేశంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర**
**ఐదేళ్ల అనుభవాలను గుర్తుచేసుకున్న కౌన్సిలర్లు**
**ఐదేళ్ల కౌన్సిల్ ప్రస్థానానికి భావోద్వేగ వీడ్కోలు**

**జగ్గయ్యపేట అక్టోబర్ 12 మనం న్యూస్:** ఐదు సంవత్సరాల క్రితం నవంబర్ 21న 2021లో ప్రమాణ స్వీకారంతో మొదలైన జగ్గయ్యపేట మునిసిపల్ కౌన్సిల్ ఐదేళ్ల ప్రస్థానం చివరి సమావేశంతో భావోద్వేగంగా ముగిసింది. సోమవారం జరిగిన ఈ చివరి కౌన్సిల్ సమావేశంలో పదవీకాలం ముగుస్తున్నందుకు కాస్త బాధ ఉన్నా సంతృప్తికరంగా దిగిపోతున్నామని కౌన్సిలర్లు తమ మనసులోని మాటను పంచుకున్నారు. ఇది తమకు ఒక హ్యాపీ మూమెంట్ అని వారు పేర్కొన్నారు. సమావేశంలో మాట్లాడిన కౌన్సిలర్లు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కొందరు కౌన్సిలర్లు భావోద్వేగంతో మాట్లాడగా మరికొందరు సాధారణ వ్యక్తులుగా ఉన్న తమను అధినాయకత్వం గుర్తించి కౌన్సిలర్లుగా అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాము కౌన్సిలర్ అవుతామని ఊహించలేదని, ప్రజా సేవ చేసే అదృష్టం కలిగినందుకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. 'కౌన్సిల్ లో మాత్రమే రాజకీయం.. బయట మేమంతా స్నేహితులం.. పార్టీలు వేరైనా అభివృద్ధి విషయంలో ఏనాడూ పక్షపాతం చూపలేదు... అందరం కలిసికట్టుగా ఉండి ఈ ఐదేళ్లు సంతృప్తికరంగా పాలించాం' అని కౌన్సిలర్లు ముక్తకంఠంతో తెలిపారు. తమ వార్డుల్లో చేపట్టిన పనుల శిలాఫలకాలపై తమ పేర్లను చూస్తే ఎంతో ఆనందంగా ఉందని.. ఆ పేర్లు జగ్గయ్యపేట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని భావోద్వేగంతో చెప్పారు. మళ్లీ ప్రజలు అవకాశం ఇస్తే బాగుండునని కొందరు కౌన్సిలర్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తమ కౌన్సిల్ ఐదేళ్ల కాలంలో రూ.205 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని అందులో 95 శాతం పూర్తయ్యాయని.. మిగిలిన ఐదు శాతం పనులు మాత్రమే ప్రస్తుతం జరుగుతున్నాయని తెలిపారు. ఇంత భారీ మొత్తంలో అభివృద్ధి జరగడం గతంలో ఎన్నడూ లేదని ఆయన గర్వంగా చెప్పారు. పట్టణంలో కనిపిస్తున్న బ్యూటిఫికేషన్ అంతా ఈ కౌన్సిల్ చేసిందేనని చెప్పారు. పట్టణంలో పోలీస్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుందంటే దానికి కౌన్సిల్ అందించిన సహకారం.సీసీ కెమెరాల ఏర్పాటే కారణమని చైర్మన్ పేర్కొన్నారు. రాజకీయాలకు కొత్త అయినప్పటికీ ప్రజల ఆశీస్సులతో బాగా రాణించినందుకు సంతోషంగా ఉందని ఆయన అన్నారు. పలువురు కౌన్సిలర్లు ఐదు సంవత్సరాల్లో తమ వార్డుల్లో జరిగిన అభివృద్ధి తమ అనుభవాలను పంచుకున్నారు.

## కేసుల పరిష్కారంలో ఏపీ ఆర్టీఐ కమిషన్‌కు జాతీయ గుర్తింపు



**మంగళగిరి,అక్టోబర్12,(మనం న్యూస్):** సమాచార హక్కు చట్టం కింద నమోదైన కేసులను వేగంగా పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు 7,034 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. సమాచార హక్కు చట్టం వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సమాచార హక్కు చట్టాన్ని మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో శక్తివంతమైన ఆయుధమని, ఉన్నత స్థాయి అధికారుల పనితీరుపై కూడా సమాచారం పొందే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. గతంలో 2024లో 3,252 కేసులు, 2025లో 3,326 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ప్రస్తుత కమిషనర్లు ఇప్పటివరకు 10 వేల కేసులను పరిష్కరించారని ప్రశంసించారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 4,894 కేసులు నమోదయ్యాయని, ఏడాది చివరి నాటికి 8 వేలకు పైగా కేసులు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. పెండింగ్ కేసులను తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ప్రధాన కమిషనర్ వివరించారు. 2013 నుంచి 2023 వరకు నమోదైన కేసులను వచ్చే నెలాఖరులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి ఇద్దరు సభ్యులతో కూడిన బెంచ్లు, ముగ్గురు సభ్యులతో కూడిన ఫుల్ బెంచ్లను ఏర్పాటు చేసి కేసులను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. మొదట నమోదైన కేసును మొదట పరిష్కరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, అవసరాన్ని బట్టి కొత్తగా వచ్చిన దరఖాస్తులకూ ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ల ద్వారానే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచే ఆన్లైన్ విచారణలో పాల్గొనే అవకాశం ఉండటంతో దూర ప్రాంతాల నుంచి కమిషన్ కార్యాలయానికి రావాల్సిన అవసరం తగ్గిందన్నారు. ప్రస్తుతం 95 శాతం విచారణలు ఆన్లైన్లోనే జరుగుతున్నాయని, ఐదు శాతం మంది మాత్రమే నేరుగా హాజరవుతున్నారని వివరించారు. ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు), సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏపీఐఓలకు) శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని ప్రతి నెలా కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమాచార కమిషనర్లు చావలి సునీల్, డా. రెహానా బేగం, గాజుల అదెన్న, డా. అల్లారెడ్డి ఉదయ భాస్కర రెడ్డి, శరత్ చంద్ర కల్యాణ్ చక్రవర్తి వట్టికూటి, వంటేరు రవి బాబు, పి.ఎన్. నాయుడు, కమిషన్ కార్యదర్శి సి.హెచ్. పద్మావతి దేవి, ఉప కార్యదర్శి కె. నరసింహారావు, న్యాయ కార్యదర్శి వి. రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.





## సరస్ మేళాకు వచ్చే 'లఖ్పతి దీదీ'ల

# పిల్లల కోసం ప్రత్యేక క్రెష్ ఏర్పాటు

### వియంసి కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ,అక్టోబర్, 12, (మనం ప్రతినిధి):** విజయవాడలో అక్టోబర్ 13 నుంచి 31వ తేదీ వరకు భవానీపురం పున్నమి ఘాట్ వద్ద నిర్వహించనున్న జాతీయ స్థాయి సరస్ మేళా-2026కు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే 'లఖ్పతి దీదీ'ల పిల్లల సంరక్షణ కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర,ఐ.ఏ.యస్. తెలిపారు. సోమవారం ఉదయం పున్నమి ఘాట్ వద్ద సరస్ మేళా ఏర్పాట్లను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల నుంచి సరస్ మేళాలో పాల్గొనే మహిళలు తమ పిల్లలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక క్రెష్లో ఉంచి, పిల్లల సంరక్షణపై ఆందోళన లేకుండా తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించవచ్చని తెలిపారు. మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పిల్లలకు సురక్షితమైన సంరక్షణ అందించడమే ఈ ప్రత్యేక ఏర్పాట్ల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేయనున్న క్రెష్ల గురించి ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించేలా సరస్ మేళాలో ప్రత్యేక స్టాల్ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సరస్ మేళాకు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, వాడుక నీటి పారుదల తదితర ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మేళా ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడంతో పాటు, కార్యక్రమం ముగిసే వరకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆరోగ్యకరమైన

# వాతావరణం కల్పిస్తున్నాం

- **ఉత్సవ ప్రాంగణాల్లో వ్యర్థాల సేకరణకు 2,500 డస్ట్బిన్ల ఏర్పాటు**
- **విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**




**విజయవాడ,అక్టోబర్,12,(మనం న్యూస్):** దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విస్తృత పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కెనాల్ రోడ్, సీతమ్మవారి పాదాలు, వినాయకుని గుడి, హోల్డింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు ఉత్సవ ప్రాంగణాలు, భక్తుల రాకపోకలు సాగించే ప్రాంతాల్లో వ్యర్థాల సేకరణ కోసం 2,500 డస్ట్బిన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా ఉత్సవ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు గుర్తించిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తులకు దోమల వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్ స్ప్రేయింగ్ వంటి చర్యలు చేపడుతున్నామని కమిషనర్ వివరించారు. ఉత్సవాల సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ కోసం సుమారు 1,400 మంది పారిశుద్ధ్య కార్మికులతో పాటు, వాహనాలు, డ్రైవర్లు, పర్యవేక్షణ అధికారులు, కంట్రోల్ రూమ్ సిబ్బంది సహా మొత్తం దాదాపు 2,000 మంది ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పారిశుద్ధ్య పనులు, వాహనాల వినియోగం, క్షేత్రస్థాయి ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పిస్తూ అమ్మవారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా చర్యలు చేపట్టడం విజయవాడ నగరపాలక సంస్థకు గర్వకారణమని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ నిర్మల గ్లోరీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై దేవాదాయ శాఖ కమిషనర్ విస్తృత పర్యటన

- **లడ్డూ తయారీ కేంద్రం, అన్నప్రసాద భవనం, వైద్య శిబిరాల నిశిత పరిశీలన**



**విజయవాడ,అక్టోబర్,12,(మనం న్యూస్):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సోమవారం ఉదయం క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటన జరిపి స్వయంగా పరిశీలించారు. రాజమండ్రి ఆర్జేసీ, దసరా ఫెస్టివల్ ఆఫీసర్ వి.త్రినాథరావుతో కలిసి ఆయన కొండపైన, కొండ దిగువన వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలన చేశారు. కొండపై ఉన్న లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. ఉత్సవాల వేళ భక్తుల రద్దీకి సరిపడా నిల్వలను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని, కౌంటర్లలో భక్తులకు ఎటువంటి కొరత లేకుండా కోరినన్ని లడ్డూ ప్రసాదాలు వేగవంతంగా అందేలా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. నూతన అన్నదాన భవనాన్ని సందర్శించిన కమిషనర్, అక్కడ జరుగుతున్న అన్నప్రసాద వితరణ ఏర్పాట్లను పరిశీలించారు. భోజనం చేస్తున్న భక్తులతో స్వయంగా మాట్లాడి ఆహార నాణ్యత, అందుతున్న సేవలపై ఆరా తీశారు. సేవకుల తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భక్తుల సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఘాట్ రోడ్డు మరియు ఆలయ ప్రాంగణంలోని ఉచిత వైద్య శిబిరాలను తనిఖీ చేసి, అత్యవసర మందుల లభ్యతపై వైద్య సిబ్బందితో సమీక్షించారు. ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో వేచి ఉండే భక్తులు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అలసటకు గురికాకుండా ఉండేందుకు తగినంత ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని, విస్తృతంగా మజ్జిగ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై నిరంతర మంచినీటి సరఫరాపై సమీక్షిస్తూ, ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. క్యూలైన్లు, హోల్డింగ్ కేంద్రాలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. క్యూలైన్ల నిర్వహణను పరిశీలించి, సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగంగా కదిలేలా పోలీస్ యంత్రాంగం, ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామచంద్ర మోహన్ సతీసమేతంగా నూతన పూజా మండపంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. అనంతరం ప్రధానాలయంలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, పర్యవేక్షక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






విజయవాడ, అక్టోబర్ 12,మనం న్యూస్: నంబూరులో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా విషాదం జరిగింది. మృతులు నున్న, నంబూరు వాసులుగా గుర్తించారు. మృతుల్లో నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాదేవ్ (39), ఆయన తల్లి అరుణ ఉన్నారు. మృతుల్లో మరో చిన్నారితో పాటు నంబూరుకు చెందిన తిగురు విజయ. క్షతగాత్రుడిని హుటాహుటిన ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకుని పోలీసులు సహాయక చర్యలు చేపట్టినారు.

# భక్తులకు సౌకర్యవంతమైన దర్శనమే లక్ష్యం



- సామాన్య భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు
- భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు - భద్రతకు పెద్దపీట
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు
- రాష్ట్ర దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్

విజయవాడ,అక్టోబర్ 12,(మనం న్యూస్): అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శన అనుభవాన్ని అందించేందుకు దేవస్థానం, సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ సోమవారం ఇంద్రకీలాద్రి పై మీడియాతో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా అమ్మవారి దర్శనం కలిగించడంతోపాటు గౌరవ రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మూలా నక్షత్రం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతుందని అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అమ్మవారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. వీవీపీ భక్తులతో పాటు సామాన్య భక్తులందరికీ ప్రాధాన్యతనిస్తూ, భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలు పర్యవేక్షిస్తున్నారన్నారు.

**భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు**

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారన్నారు. భక్తులు ఎక్కువసేపు ఇబ్బందులు పడకుండా దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.ఉత్సవాల సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తగిన బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. .

**భక్తులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం**

నవరాత్రి ఉత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం, భద్రతతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని అందించడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాట్లు చేపట్టామన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు మీడియా సెంటర్ ఏర్పాటు చెయ్యాలి

- మున్సిపల్ కమిషనర్ కు జగ్గయ్యపేట ప్రెస్ క్లబ్ ప్రతినిధుల వినతి

జగ్గయ్యపేట అక్టోబర్ 12 మనం న్యూస్: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అల్లి రవిచంద్ , సీనియర్ పాత్రికేయులు అన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ పి వి వి డి ప్రసాద్ కు సీనియర్ పాత్రికేయులు ముత్యాల సైదేశ్వర రావు, ఎల దండి శ్రీనివాసరావు,జగ్గయ్యపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అల్లి రవిచంద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులతో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడుతూ జగ్గయ్యపేట పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయటంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా డిజిటల్ మీడియా ప్రతినిధులకు సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా మున్సిపల్ మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ నామినేషన్లు స్వీకరణ ,పరిశీలన, ఉపసంహరణ అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు, తదితర ఎన్నికల కు సంబంధించిన సమాచారాన్ని తెలియజేయుటానికి అధికారికంగా మున్సిపాలిటీ నుండి మీడియా సెంటర్ ఏర్పాటు చేసి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా సెంటర్ ఏర్పాటు ద్వారా అధికారిక సమాచారం పారదర్శకంగా వేగవంతంగా ప్రజలకు చేరే అవకాశం ఉంటుందన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో మీడియా ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కార్యాలయంలో మీడియా సెంటర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు.మీడియా సెంటర్ ఏర్పాటు చేయడానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎల్రక్టా మీడియా పాత్రికేయులు అల్లి సత్యనారాయణ, వల్లాపురపు వెంకట బాబు, రామకృష్ణ, రాంబాబు, అల్లి లక్ష్మీ కిషోర్, రేవంత్ శాస్త్రి లు పాల్గొన్నారు.



# అనాసాగరంలో ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ప్రారంభం

- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తోడ్పాటు
- నందిగామ పిఏసీఎస్ చైర్మన్ కొట్టే హరికృష్ణ (బద్రి) సహాయ సహకారాలతో ప్రజలకు రవాణా సౌకర్యం



నందిగామ,అక్టోబర్ 12,మనం న్యూస్: నందిగామ పట్టణ పరిధిలోని అనాసాగరం గ్రామ ప్రజల చిరకాల అవసరమైన ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ సోమవారం ప్రారంభమైంది.గ్రామ ప్రజల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తోడ్పాటు, అలాగే నందిగామ పిఏసీఎస్ చైర్మన్ కొట్టే హరికృష్ణ (బద్రి) సహాయ సహకారాలతో ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ రిక్వెస్ట్ స్టాప్ను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మరియు మునిసిపల్ కమిషనర్ లోవరాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, రవాణా సౌకర్యం మెరుగుపరిచే దిశగా తీసుకున్న ఈ చర్యతో అనాసాగరం ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పిఏసీఎస్ చైర్మన్ కొట్టే హరికృష్ణ (బద్రి) మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనాసాగరం ప్రజలు తమ గ్రామానికి ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి, పిఏసీఎస్ చైర్మన్ కొట్టే హరికృష్ణ (బద్రి)కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు తుటారి కృష్ణ, దుగ్గిదేవి గోపి, రామిరెడ్డి రమేష్, ఆర్టీసీ సిబ్బంది, గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తాడేపల్లి లో వైఎస్ఆర్సిపి కి మళ్ళీ పూర్వ వైభవం తీసుకొస్తాం

- పట్టణ అధ్యక్షుడు దొంతి రెడ్డి రామకృష్ణారెడ్డి



తాడేపల్లి, అక్టోబర్ 12, మనం న్యూస్:తాడేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని అంజిరెడ్డి భవన్లో దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త మాజీ దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ, గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని, కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలనిపిలుపునిచ్చారు. నాయకులంతా సమన్వ యంతో పనిచేస్తే తాడేపల్లిలో పార్టీకి తిరిగి పూర్వ వైభవం తీసుకుర వడం సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు..పట్టణ అధ్యక్షుడు దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడు తూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ తాడేపల్లిలో వైఎస్సార్సీపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చల్లపల్లి మోహన్‌రావు, మంగళగిరి, దుగ్గిరాల, మండలా, పట్టణా, అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



# ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్లపై...
# భక్తుల హర్షం

**సమస్యలను సరిదిద్దుకుంటూ మరింత మెరుగైన సౌకర్యాలు**
**భక్తుల సౌకర్యమే లక్ష్యంగా కలెక్టర్**
**దేవస్థానం, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయం**

**ఇంద్రకీలాద్రి,అక్టోబర్,12,(మనం న్యూస్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు తరలివస్తున్న భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు, నగరపాలక సంస్థ, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు చేపడుతున్నాయి. ఉత్సవాల తొలిరోజు ఎదురైన సమస్యలను గుర్తించి, వాటిని సరిదిద్దుకుంటూ తదుపరి రోజుల్లో ఏర్పాట్లను మరింత పటిష్ఠం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి ఉత్సవాల నిర్వహణలో కీలకంగా నిలుస్తోంది.

### భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా గాంధీ వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత విభాగాలకు సూచిస్తున్నారు.తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, దర్శన క్యూలైన్ల నిర్వహణ, రద్దీ నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారిస్తూ, సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కార చర్యలు చేపట్టేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు.



### సమస్యల పరిష్కారంతో మెరుగుపడుతున్న ఏర్పాట్లు

ఉత్సవాల తొలిరోజు ఎదురైన సమస్యలను సమీక్షించి, వాటి పునరావృతం కాకుండా అవసరమైన మార్పులు చేపట్టడంపై అధికారులు దృష్టి సారిం చారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుతూ, భక్తులకు అవసరమైన సదుపాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నారు. భక్తులనుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.



### భక్తుల సంతృప్తే ఏర్పాట్లకు కొలమానం

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రశాంతమైన, సౌకర్యవంతమైన అనుభవం కల్పించడమే అధికార యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోంది. క్యూలైన్ల క్రమబద్ధీకరణ నుంచి మౌలిక సదుపాయాల నిర్వహణ వరకు ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లను మెరుగుపరుస్తున్నారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలపై సానుకూల స్పందనలు లభిస్తే, అవి అధికారుల సమన్వయానికి, నిరంతర పర్యవేక్షణకు ప్రోత్సాహాన్నిస్తాయి. అదే సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించడం ద్వారా దర్శన అనుభవాన్ని మరింత మెరుగుపర చవచ్చు. రానున్న నవరాత్రి రోజుల్లోనూ భక్తుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లను సమీక్షిస్తూ, సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు.



# టీడీపీతోనే బీసీలకు పెద్దపీట

- చంద్రబాబు హయాంలోనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు
- దానబోయిన, వల్లభనేని

**తాడేపల్లి, అక్టోబర్ 12, మనం న్యూస్:**బీసీలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు కల్పించి, వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్,టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు.సోమవారం తాడేపల్లి టీడీపీ పట్టణ కార్యాల యంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1987లో బీసీ సెల్ను ఏర్పాటు చేసిన టీడీపీ, బీసీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 1996లో పంచాయతీరాజ్ వ్యవస్థలో బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించారని వివరించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని దాని వల్ల 16,800 మంది బీసీ లు నష్ట పోయారని అన్నారు.బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుం దని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసే విషయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని తెలిపారుబీసీల సంక్షేమం, అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అద్దంకి మురళి, కేళి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడమే టీడీపీ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి దారా దాసు,ఇట్టా భాస్కర్, మున్నంగి సంజీవరెడ్డి, మండవ గోపాల రావు, జి.నాగేశ్వరరావు తాడి పోయిన భాస్కర్, పుల్లెపు భాస్కర రావు, లావణ్య, తాడిబోయిన గోపి,కంభం సాయి చంద్, అడపా నరేష్, సుబ్బారావు, వెంకటరెడ్డి, బచ్చియా,చింకా శ్రీను,బబ్లు, అంజిరెడ్డి, రంగస్వామి, బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# ట్రాన్స్ జెండర్లకు ఇళ్ల పట్టాల పంపిణీ

- 19 మందికి ఇళ్ల పట్టాలు అందజేత, జై నారాయణ అంటూ ట్రాన్స్ జెండర్ల నినాదాలు

**నెల్లూరు: అక్టోబర్ 12 (మనం న్యూస్):** నెల్లూరు నగరంలో ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం మరో చారిత్రక అడుగు వేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు..ఆగస్టు 1వ తేదీన 4వ డివిజన్లో మంత్రి నారాయణ గారు పర్యటించి పెన్షన్లు పంపిణీ చేస్తున్న సమయంలో, ట్రాన్స్ జెండర్లు తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ఆయనను కోరారు. వెంటనే స్పందించిన మంత్రి , తహశీల్దార్ మరియు జేసీలను అలాగే కమిషనర్ ని అప్రమత్తం చేసి వారికి తక్షణమే పట్టాలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు వెంటనే ఏర్పాట్లు చేయగా, ఈరోజు 19 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరవ్యాప్తంగా ట్రాన్స్ జెండర్లు మొత్తం ఎంతమంది ఉన్నారని మంత్రి నారాయణ ఆరా తీయగా 140 మంది ఉన్నారని తెలిపారు. స్పందించిన ఆయన, నగరవ్యాప్తంగా ఉన్న ఆ 140 మంది ట్రాన్స్ జెండర్లందరికీ త్వరలోనే ఇళ్ల పట్టాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, ఇళ్లు కట్టుకునే ప్రతి ఒక్కరికీ తన సొంత మరియు పిల్లల నిధుల నుంచి 50,000 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ పట్టాలు అందుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా 2.5 లక్షల సాయం కూడా త్వరలోనే అందేలా చూస్తామన్నారు. గతంలో కర్నూలులో ఉన్నప్పుడే ట్రాన్స్ జెండర్ల పెన్షన్ల కోసం జీవో తెచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, ట్రాన్స్ జెండర్లు సహా అందరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తమ సమస్యను సత్వరమే పరిష్కరించి ఇళ్ల పట్టాలు అందించినందుకు ట్రాన్స్ జెండర్లు అందరూ మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ జై నారాయణ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్,మేయర్ సుజాత ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ నగర తాసిల్దార్ మరియు , మాజీ కార్పొరేటర్ సంక్రాంతి కళ్యాణ్..నగర అధ్యక్షుడు మామిడల మధు, శైలజ,నారాయణ రెడ్డి,స్థానిక టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## సోమిరెడ్డితో అభివృద్ధిలో పోటీ పడగలను కానీ అవినీతిలో పోటీ పడలేను



**పొదలకూరు: అక్టోబర్ 12 (మనం న్యూస్):** నాకన్నా ముందు సోమిరెడ్డి ఈరోజు పొదలకూరులో పర్యటించాడు, ఎన్నికల సమయంలో మాత్రమే చంద్రబాబు, సోమిరెడ్డికి ప్రజల అభివృద్ధి, సంక్షేమం గుర్తుకొస్తాయని సోమిరెడ్డి ఏదో ఒరగపెట్టినట్టుగా కలరింగ్ ఇవ్వడం, ఉన్నవి లేనివి మాట్లాడడం,విచ్చలవిడిగా అవినీతికి పాల్పడడం తప్ప, సోమిరెడ్డి సర్వేపల్లి నియోజకవర్గం లో చేసింది ఏమీ లేదన్నారు 28 నెలలుగా సోమిరెడ్డికి చేతగాక, ఏమీ చేయలేక గత ప్రభుత్వంలో మేము చేసిన పనులకు వంకలు పెట్టడం తప్ప సోమిరెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు, సోమిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు వెలగబెట్టింది ఏమీ లేదని, సోమిరెడ్డి చేయలేని పనులు వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చాక నేను చేసి చూపించానని సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణం చేపడితే, సోమిరెడ్డికి మాట్లాడడానికి ఏమీ లేక డ్రైన్లు సరిగా లేవని చెప్పడం సిగ్గుచేటు అన్నారు సోమిరెడ్డి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం కుంటుబడిందని మాటలు చెప్పి వెళ్లిపోవడం తప్ప, ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. సోమిరెడ్డి ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయమంటున్నాడు, అభివృద్ధిని చూసి ఓటు వేసే పనైతే సోమిరెడ్డి కి ఎందుకు అంత భయం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారిపై రోజుకొక దొంగ కేసు పెట్టి, పోలీసు స్టేషన్లలో పెట్టి, జైళ్లకు పంపిస్తూ,బెదిరిస్తున్నారని మండిపడ్డారు అభివృద్ధిని చూసి ఓట్లు వేసే పనైతే సోమిరెడ్డి ముఖారవిందాన్ని చూసి బ్రహ్మాండమైన అందగాడు ఎమ్మెల్యే అని, తన అంత ఉత్సాహవంతుడు, విద్యాధికుడు, దూరదృష్టి గలవారు ,చేతివాటం ప్రదర్శించడంలో ఇంకెవరూ లేరని ప్రచారం చేసుకోవడం, పరిపాలన బ్రహ్మాండంగా ఉందని చెప్పుకోవడం మానేసి, వైఎస్సార్సీపీ వాళ్లను ఏదో ఒక విధంగా భయాందోళనకు గురిచేసి గెలవాలనే లక్ష్యంతో చూస్తున్నారని విమర్శించారు. సోమిరెడ్డిని ఒకటే అడుగుతున్నా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో, పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి ఆరాచకాలకు పోకుండా, పోలీసులు కేసులు పెట్టుకోకుండా, శాంతియుతంగా, ధర్మబద్ధంగా, చట్టబద్ధంగా ఎన్నికలు జరిపించండి , అభివృద్ధి, సంక్షేమం ఎవరు చేశారనే దానిపై ప్రజలు స్పష్టమైన తీర్పునిస్తారని, ఆ విధంగా కాకుండా వాళ్ళని బెదిరించి, పోలీస్ కేసులు పెట్టి ఇబ్బందులు పెడతామని చెప్పడం సరికాదని కాకాణి పేర్కొన్నారు.

## బుచ్చి మున్సిపల్ వైసిపి చైర్‌పర్సన్ అభ్యర్థిగా షేక్ షకీల బేగం

**▸▸ అభ్యర్థిని ప్రకటించిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి**



**బుచ్చిరెడ్డిపాలెం: అక్టోబర్ 12 (మనం న్యూస్):** నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం చైర్ పర్సన్ అభ్యర్థిని వైసిపి మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ప్రకటించారు. తాజాగా వెలువడిన రిజర్వేషన్ల ప్రకారంగా బుచ్చిరెడ్డిపాలెంకి జనరల్ ఉమెన్ కేటాయించారు. దీంతో గతంలో జనరల్ వస్తుందని నేపథ్యంలో కడివేటి శ్రీనివాసులు రెడ్డిని బుచ్చి చైర్ పర్సన్ వైసీపీ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే సమీకరణాలు మారడంతో షకీలా బేగం చైర్పర్సన్ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. ముస్లిం మైనారిటీ ఓట్లు అత్యధికంగా ఉండడం బీసీ ఓట్లు సైతం ఈక్వల్ గా ఉండడంతో బుచ్చిలో చైర్ పర్సన్ అభ్యర్థి పోటీ ఆసక్తికరంగా మారనుంది. వైసిపి ముస్లిం మైనారిటీ కి పెద్దపీట వేస్తుందని చెత్త రాజకీయాలు చేసే వారిని అమ్ముడు పోయే వారిని పార్టీలో ఉంచమని నల్లపురెడ్డి ఈ సందర్భంగా గతంలో జగన్మోహన్ రెడ్డి బొమ్మ పెట్టుకుని పార్టీలో గెలిచిన వారిపై ఆరోపణలు చేశారు. నిజాయితీగా పార్టీని నమ్ముకుని కష్ట కాలంలో సైతం ఉన్న వారిని ఆదరించాలని అలాగే బుచ్చి అభివృద్ధికి షకీలా బేగం ని గెలిపించాలని ఆయన అన్నారు.

## భక్తుల తాగునీటి సమస్యపై కలెక్టర్ తక్షణ స్పందన

**▸▸ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు**

**ఇంద్రకీలాద్రి,అక్టోబర్, 12,(మనం న్యూస్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ క్షేత్రస్థాయిలో పర్యటించి, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తాగునీటి విషయంలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లలో నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పారిశుధ్యం, మరుగుదొడ్లు, క్యూలైన్ల నిర్వహణ వంటి మౌలిక వసతులపైనా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ, దేవస్థానం అధికారులు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. భక్తుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ఆలస్యం లేకుండా పరిష్కరించడం ద్వారా సౌకర్యవంతమైన దర్శనం కల్పించాలని సూచించారు.



## 12వ వేతన సవరణ సంఘం చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన దినేష్ కుమార్

**అమరావతి,అక్టోబరు12,(మనం ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పెంపుదలకు సంబంధించిన 12వ వేతన సవరణ సంఘం చైర్మన్ గా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈమేరకు ఆయన సోమవారం ఎపి సచివాలయంలో పిఆర్సి చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు.1983 ఐఎఎస్ బ్యాచ్ కు చెందిన ఆయన గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.ఈనెల 1వ తేదీన దినేష్ కుమార్ చైర్మన్ గా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జిఓఎంఎస్ సంఖ్య 200 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది.ఏడాది లోగా పిఆర్సి నివేదికు సమర్పించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్న నేపధ్యంలో ఆయన పిఆర్సి చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు.పిఆర్సి చైర్మన్ గా రాష్ట్రంలో గల అన్ని ప్రభుత్వ శాఖల నుండి సమాచారాన్ని తీసుకోవడంతో ఉద్యోగులు



ఉద్యోగ సంఘాల నుండి పూర్తి వివరాలు సేకరించి పూర్తి స్థాయి అధ్యయనం చేసిన తదుపరి వేతనాల పెంపుదలకు సంబంధించి ఏడాది గడువులోగా పిఆర్సి నివేదికను దినేష్ కుమార్ ప్రభుత్వానికి సమర్పిస్తారు.పిఆర్సి చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన దినేష్ కుమార్ ను రాష్ట్ర ఆర్ధిక శాఖ కార్యదర్శి వి.వినయ్



చంద్,అదనపు కార్యదర్శి గౌతమ్ అల్లాడలు కలిసి పుష్పగుచ్చం అందించి శుభా కాంక్షలు తెలిపారు.అదే విధంగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ ఆఉద్యోగ సంఘం ప్రతినిధులు దినేష్ కుమార్ ను కలిసి పుష్పగుచ్చం అందించి దుస్సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## 12వ పీఆర్సీ త్వరగా పూర్తి చేయాలి.. ఉద్యోగులకు మెరుగైన ఫిట్మెంట్ ఇవ్వాలి

**▸▸ పీఆర్సీ కమిషనర్ దినేష్ కుమార్‌కు సచివాలయ సంఘం విజ్ఞప్తి**

**అమరావతి,అక్టోబర్,12,(మనం ప్రత్యేక ప్రతినిధి):** 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా సిఫారసులు చేయాలని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం కోరింది. ఈ మేరకు 12వ పీఆర్సీ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ను సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో 11వ పీఆర్సీ ద్వారా ప్రకటించిన ఫిట్మెంట్ కారణంగా ఉద్యోగులకు అంతకుముందు ప్రకటించిన మధ్యంతర భృతి (ఐఆర్) కంటే తక్కువ ప్రయోజనం లభించిందని సంఘం ప్రతినిధులు వివరించారు. దీంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని 12వ పీఆర్సీలో సమగ్రంగా పరిశీలించి, ఉద్యోగులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిట్మెంట్కు అనుగుణంగా వివిధ అలవెన్సులు, రుణాలు, అడ్వాన్సులు, ప్రోత్సాహకాలను సవరించాల్సి ఉన్నప్పటికీ, గతంలో వాటిని తగిన విధంగా సమీక్షించకపోవడంతో ఉద్యోగులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈసారి ఫిట్మెంట్తో పాటు అలవెన్సులు, లోన్లు, అడ్వాన్సులు, ఇన్సెంటివ్లను కూడా సమీక్షించి, ఉద్యోగులకు గరిష్ఠ ప్రయోజనం కల్పించేలా సిఫారసులు చేయాలని విజ్ఞప్తి చేశారు. 12వ పీఆర్సీ ప్రక్రియలో జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో నివేదిక రూపొందించి, ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులు, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహేతుకమైన ఫిట్మెంట్ను సిఫారసు చేయాలని కోరారు. వేతన సవరణతో పాటు ఇతర ఆర్థిక ప్రయోజనాల విషయంలోనూ సమగ్ర దృష్టితో వ్యవహరించాలని కమిషనర్కు సూచించారు. సచివాలయ సంఘం ప్రతినిధులు వివరించిన అంశాలను పీఆర్సీ కమిషనర్ దినేష్ కుమార్ శ్రద్ధగా ఆలకించి సానుకూలంగా స్పందించినట్లు సంఘం తెలిపింది. పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉద్యోగ సంఘాలు సమర్పించే ప్రతిపాదనలను పరిశీలించి, తగిన విధంగా పరిగణనలోకి తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయ బద్ధమైన వేతన సవరణ, మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు అందేలా తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ, కార్యవర్గ ప్రతినిధులు వెల్లడించారు.







# ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రతకు 'టెక్నాలజీ కవచం'

- దర్శన క్యూలైన్ల నుంచి ఘాట్ రోడ్ల వరకు ఆధునిక నిఘా..
- ఏఐ కెమెరాలు, డిజిటల్ డిస్ప్లేలు, స్మార్ట్ ట్రాకింగ్‌తో పర్యవేక్షణ..

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

ఇంద్రకీలాద్రి,అక్టోబర్,12,(మనం న్యూస్): భక్తిభావానికి ప్రతీకగా నిలిచే విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తుల భద్రత, సౌకర్యవంతమైన దర్శనం, రద్దీ నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారుతోంది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం రూపొందించిన దసరా-2026 ఐటీ ఏర్పాట్లలో భాగంగా దర్శన క్యూలైన్ల నుంచి అన్నప్రసాద వితరణ కేంద్రాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఘాట్ రోడ్ల వరకు వివిధ సాంకేతిక వ్యవస్థలను వినియోగించే విధానాలను రూపొందించారు. భక్తుల రాకపోకలను పర్యవేక్షించడం, రద్దీని అంచనా వేయడం, వాహనాల ప్రవేశాన్ని నియంత్రించడం, తప్పిపోయిన పిల్లల ఆచూకీ గుర్తించడంలో ఈ సాంకేతిక పరిజ్ఞానం సహాయకారిగా నిలవనుంది.

## దర్శన క్యూలైన్లలో ఏఐ కెమెరాలు.. వేచి ఉండే సమయంపై అంచనా

అమ్మవారి దర్శనం కోసం భక్తులు గంటల



తరబడి క్యూలైన్లలో వేచి ఉండే సందర్భాల్లో రద్దీ పరిస్థితులను అంచనా వేయడానికి అఐ ఊఖ్ఖి కెమెరా ఆధారిత దర్శన సమయ అంచనా వ్యవస్థ రూపొందించారు. దర్శన క్యూలైన్ల వద్ద ఏర్పాటు చేసే కెమెరాల నుంచి లభించే సమాచారం ఆధారంగా భక్తుల కదలికలను పర్యవేక్షించడం, ప్రవేశం-నిష్క్రమణ సమాచారాన్ని విశ్లేషించడం, దర్శనానికి పట్టే సమయాన్ని అంచనా వేయడం ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం. ఈ వ్యవస్థకు అనుసంధానించిన డిజిటల్ డిస్ప్లేల ద్వారా అంచనా వేసిన దర్శన సమయాన్ని భక్తులకు తెలియజేసే అవకాశం ఉంటుంది. రద్దీ ఎక్కువగా ఉన్న క్యూలైన్లను గుర్తించి అధికారులు తగిన చర్యలు తీసుకోవడానికి కూడా ఈ సమాచారం ఉపయోగపడుతుంది. దర్శన క్యూలైన్లతో పాటు అన్నప్రసాదం స్వీకరించే ప్రాంతాల్లోనూ భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు అఐ ఇటౌరీఛీ ఇౌ్టజీజ ఛ్యిజ్టూజీఛిట వ్యవస్థను ప్రతిపాదించారు. క్యూలైన్లలో ఉన్న భక్తుల సంఖ్యను అంచనా వేయడం, వివిధ ప్రాంతాల్లో రద్దీ స్థాయిలను పరిశీలించడం, రోజువారీ గణాంకాలను రూపొందించడం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశాలు.అన్నప్రసాద క్యూలైన్లలో భక్తుల రాకపోకలను పర్యవేక్షించడం ద్వారా అవసరమైన చోట సేవలను క్రమబద్ధీకరించేందుకు అధికారులకు సమాచారం అందుతుంది. రద్దీ పెరిగే సమయాల్లో సిబ్బంది అప్రమత్తతకు, భక్తుల కదలికలను క్రమబద్ధీకరించేందుకు ఈ సాంకేతికత తోడ్పడుతుంది. రద్దీని ఒకేసారి క్యూలైన్లలోకి అనుమతించకుండా క్రమబద్ధీకరిం చేందుకు అఐ ఆధారిత స్మార్ట్ హోల్డింగ్ ఏరియా మానిటరింగ్, బ్లాక్ రిలీజ్ వ్యవస్థ కీలకమైన ఏర్పాటు. హోల్డింగ్ ప్రాంతాలను బ్లాక్లుగా విభజించి, ప్రతి బ్లాక్లోని రద్దీ స్థితిని డిజిటల్ డిస్ప్లేల ద్వారా పర్యవేక్షించే విధంగా దీన్ని రూపొందించారు. ఏదైనా బ్లాక్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు అక్కడి పరిస్థితిని గుర్తించి, తదుపరి బ్లాక్లోకి భక్తులను క్రమపద్ధతిలో విడుదల చేయడానికి ఈ వ్యవస్థ సహాయపడుతుంది. బ్లాక్ల వారీగా స్థితిగతులను నవీకరించడం ద్వారా క్యూలైన్లలో రద్దీని నియంత్రించేందుకు, భక్తుల కదలికలను మరింత క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఉంటుంది.

## పిల్లల భద్రతకు క్యూఆర్ కోడ్ రిస్ట్బ్యాండ్లు

దసరా ఉత్సవాల్లో కుటుంబాలతో వచ్చే చిన్నారులు రద్దీ కారణంగా తప్పిపోయే ప్రమాదాన్ని తగ్గించేందుకు ఖఖ ఇౌఛ్ఛి ఉ్ఛఝ్టూఛీ ఇజిజీజూఛీ ఖీట్ఛిజుజ్ఞీజ గిటజ్టీట్టఞ్ఛీట ఏర్పాటు చేశారు. పిల్లల చేతికి ధరింపజేసే రిస్ట్బ్యాండ్లోని క్యూఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా అందులో అనుసంధానించిన తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వివరాలను గుర్తించే విధానాన్ని రూపొందించారు. చిన్నారి తప్పిపోయిన సందర్భంలో సిబ్బంది రిస్ట్బ్యాండ్ను స్కాన్ చేసి సంబంధిత కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకుని వారిని తిరిగి కలిపేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. పెద్ద సంఖ్యలో భక్తులు ఒకేచోట చేరే ఉత్సవాల సమయంలో కుటుంబాలకు భరోసా కల్పించడంలో ఇది ముఖ్యమైన భద్రతా చర్యగా నిలుస్తుంది. ఇంద్రకీలాద్రికి చేరుకునే ఘాట్ రోడ్లపై వాహనాల రాకపోకలను పర్యవేక్షించేందుకు ఖీర్ఝ్ఛుట్ట అ్ఖ్ఖ ఇ్ఛ్ఝ్ఛుట్చుట వినియోగించే విధానాన్ని రూపొందించారు. వాహన నంబరు ప్లేట్లను గుర్తించే ఈ కెమెరాల ద్వారా వాహన వివరాలను సంబంధిత పాస్ డేటాబేస్తో సరిపోల్చి, అనుమతుల స్థితిని పరిశీలించవచ్చు. చెల్లుబాటు అయ్యే వాహన పాస్ ఉన్న వాహనాల ప్రవేశాన్ని గుర్తించడం, చెల్లని లేదా గడువు ముగిసిన పాస్లను గుర్తించడం, అనధికార ప్రవేశాన్ని నియంత్రించేందుకు సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేయడం ఈ వ్యవస్థ లక్ష్యం. వాహన ప్రవేశ సమయంలో పాస్



స్థితి, వాహన వివరాలను డిస్ప్లేలో చూపించే విధానం కూడా ఇందులో భాగంగా ఉంది.భక్తుల వాహనాలు పెద్ద సంఖ్యలో చేరే పార్కింగ్ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను గుర్తించడం, పార్కింగ్ వినియోగాన్ని పర్యవేక్షించడం, వాహనాల రద్దీని తగ్గించడం కోసం అఐ ఇ్ఛర్ఝ్ఛుట్చ-ఆ్టఛీ ఛ్టజుజ్ఞీజ ఝ్చ్ఞ్చజ్ఛ్ఝ్ఛుఞ్టు వ్యవస్థను రూపొందించారు .పార్కింగ్ స్థలాల సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థతో అనుసంధానించడం ద్వారా అందుబాటులో ఉన్న స్థలాల వివరాలను తెలుసుకోవడానికి, వాహనాలను క్రమబద్ధంగా నిలిపేందుకు మార్గనిర్దేశం చేయడానికి వీలవుతుంది. పార్కింగ్ ప్రాంతాల్లో అనవసర రద్దీ తగ్గితే భక్తుల రాకపోకలు సులభతరమవుతాయి. చెత్తకుండీల నిండుదల స్థితిని కెమెరాల ద్వారా పర్యవేక్షించి, అవి నిండినప్పుడు సంబంధిత పారిశుద్ధ్య సిబ్బందికి సమాచారం అందించడం దీని ప్రధాన ఉద్దేశం.చెత్తకుండీ ఉన్న ప్రదేశం, దాని నిండుదల స్థితి, శుభ్రపరిచే ప్రక్రియకు సంబంధించిన వివరాలను డ్యాష్బోర్డులో నమోదు చేయడం ద్వారా పరిశుభ్రత నిర్వహణను మెరుగుపరచవచ్చు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో పారిశుద్ధ్య సేవలు సమయానికి అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది.లడ్డూ ప్రసాదం పొందేందుకు భక్తులు ఎదుర్కొనే రద్దీని తగ్గించేందుకు ఖీర్ఝ్ఛుట్ట ఔ్ఛఛీఛీం ఛ్ఛిఛీజ్ఞీజ ఝ్ఛిజిజీఞ్ఛిలను ఏర్పాటు చేసే విధానం కూడా సాంకేతిక ప్రణాళికలో భాగంగా ఉంది. ఆన్లైన్ బుకింగ్, టికెట్ లేదా మొబైల్ ద్వారా పొందిన క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి లడ్డూ బాక్సులను తీసుకునే విధంగా ఈ యంత్రాలను రూపొందించారు.భక్తులు తమ బుకింగ్కు అనుగుణంగా ప్రసాదాన్ని పొందేందుకు ఈ విధానం సహాయపడుతుంది. ప్రసాద కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించడం, పంపిణీ ప్రక్రియను క్రమబద్ధీకరించడం దీని ముఖ్య ఉద్దేశాలు.

## భద్రతకు సాంకేతికత.. సమన్వయానికి అధికారుల అప్రమత్తత

భక్తులకు సురక్షితమైన, ప్రశాంతమైన దర్శన అనుభవాన్ని అందించడం, రద్దీని క్రమబద్ధీకరించడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ సాంకేతిక ఏర్పాట్లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటూ అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఉత్సవాల నిర్వహణలో ప్రధాన లక్ష్యం.





# జనసేన నేత సుకుమార్ రెడ్డి తీరుపై కూటమి నేతలు ఆగ్రహం ??

**అమరావతి: అక్టోబర్ 12 (మనం న్యూస్):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒకటికి రెండు సార్లు సస్పెండ్ కు గురై ఇటీవల జనసేన పార్టీలో చేరిన కావలి నియోజకవర్గంకు చెందిన మన్నెమాల సుకుమార్ రెడ్డి తీరుపై నియోజకవర్గంలోని కూటమి నేతలు. జిల్లాలోని ముఖ్యమైన జనసేన నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.. సుకుమార్ రెడ్డి జనసేన పార్టీలో చేరిన తర్వాత జిల్లాలోని ముఖ్యమైన జనసేన పార్టీ నాయకులను గాలికి వదిలేసి తెలుగుదేశం పార్టీ నాయకుల సేవలో మునిగి తేలుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇంకా ముఖ్యమైన టిడిపి నాయకులను మాత్రమే కలవడం పట్ల జనసేన నేతలు రగిలిపోతున్నారు.. కొద్దిమంది జనసేన పార్టీ నేతలను అలా కలిసి వెళ్లిపోవడం తెలుగుదేశం పార్టీ వాళ్ల వద్ద మాత్రం గంటల తరబడి మాట్లాడుకోవటం పట్ల జనసైనికులు ఓ రేంజ్ లో ఫైర్ అవుతున్నారు. అసలు సుకుమార్ రెడ్డి చేరింది తెలుగుదేశం పార్టీలోనా లేక జనసేన పార్టీలోనా అని ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారు. సుకుమార్ రెడ్డి జనసేనలో పార్టీలో చేరడానికి ముందే చాలామంది జనసైనికులు ఆయనను జనసేనలోకి తీసుకోవద్దని అధినేత పవన్ కళ్యాణ్ కు ఎన్నెన్నో ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ ప్రతి ఒక్కరిని ముఖ్యంగా జనసైనికులను ఇబ్బందులకు గురి చేశారని ఆ పార్టీ నాయకులే ఇటీవల మీడియా సమావేశాలు పెట్టి దుమ్మెత్తి పోసిన విషయం తెలిసిందే.దానికి తోడు నకిలీ మద్యం కేసులో జైలుకు కూడా పోయిరావడంతో అతనిని జనసేన పార్టీలోకి ఎలా తీసుకున్నారో అర్థం కావటం లేదని జనసైనికులే చర్చించుకుంటున్నారు. అవసరం వస్తే తగ్గి మాట్లాడటం అవసరం తీరిపోతే నువ్వు ఎంత అనే మాట్లాడటం ఆయన నైజం అంటూ ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటున్నారు. కావలి నియోజక వర్గంలో ఇటీవల సుకుమార్ రెడ్డి వైసీపీ లోని ముఖ్యమైన నాయకులను కార్యకర్తలను జనసేనలోకి ఆహ్వానిస్తున్నారు ఇంతవరకు బాగానే ఉంది. అయితే స్థానికంగా ఎంతో మంచి వ్యక్తిగా సౌమ్యుడుగా పేరుగాంచిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి మాత్రం మాట వరస కూడా చెప్పకుండా సుకుమార్ రెడ్డి ఇస్తాను సారంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీనిపైన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కూడా రగిలిపోతున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలో ఎక్కడైనా చేరికలు ఉంటే ఒకరినొకరు మాట్లాడుకుని చేర్చుకోవాలా వద్దా అని చర్చించుకుని తర్వాత పార్టీలలో చేర్చుకుంటున్నారు. కానీ సుకుమార్ రెడ్డి మాత్రం కావలి ఎమ్మెల్యేను గాలికి వదిలేసి ఆయనకి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నాడని జనసైనికులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైసిపి నుండి సస్పెండ్ చేసిన తర్వాత మళ్లీ ఆ పార్టీలోకి పోవటానికి నానా విధాలుగా ప్రయత్నాలు చేసి ఎట్టికేలకు అప్పటి ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో మళ్లీ వైసీపీలో చేరారు. ఎలక్షన్ అయిపోయిన కొద్ది రోజులకే మళ్ళీ సస్పెండ్ చేయడం జరిగింది.మళ్లీ ఇప్పుడు వైసీపీలోకి పోడు అని గ్యారెంటీ ఏమిటంటు ప్రతి నోటా వినిపిస్తుంది. ఏది ఏమైనా సుకుమార్ రెడ్డి జనసైనికులను గాలికి వదిలేసి టిడిపి ముఖ్య నాయకులతో చట్టపట్టలు వేసుకొని ఉండటం పట్ల జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి మాటవరసకు కూడా ఏమి చెప్పకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పార్టీలో చేర్చుకోవడం ఏమిటంటే పెద్ద చర్చ జరుగుతుంది. ఎవరి మెప్పు పొందడానికి ఈ పని చేస్తున్నాడు సుకుమార్ రెడ్డి అని కూటమి నేతలు అగ్ర వ్యక్తం చేస్తున్నారు.కావలిలో జనసేన పార్టీలోకి చేరే నాయకులకు పదవులు ఇస్తానని ఆశ చూపి చేర్చుకోవడం న్యాయం కాదని ఏదైనా ఉంటే స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి ముందడుగు వేయాలని ఇది కూటమి నియమ నిబంధనలనుకు తూట్లు పోడవటమేనని కూటమి నేతలు గుసగుసలాడుకుంటున్నరు.

మరి సుకుమార్ రెడ్డి తీరుపై విచారించి పవన్ కళ్యాణ్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.